

చటారి దశరథ్‌కు
## కేసీఆర్ ఆశీస్సులు

బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్ తన జన్మదినం సందర్భంగా మంగళవారం మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో తనను కలిసిన విద్యార్థి నాయకుడికి శాలువా కప్పి ఆశీర్వదించారు.

– ఉస్మానియా యూనివర్సిటీ

## పీహెచ్‌డీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 16: ఉస్మానియా యూనివర్సిటీ పీహెచ్‌డీ నోటిఫికేషన్‌ను తక్షణమే విడుదల చేయాలని ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యుడు అలివేలి రాజు డిమాండ్ చేశారు. పాత విధానంలోనే ప్రవేశాలు నిర్వహించాలని కోరారు. రెండేళ్లుగా పీహెచ్‌డీ నోటిఫికేషన్ విడుదల కాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ఇతర యూనివర్సిటీలలో పీహెచ్‌డీ నోటిఫికేషన్లు విడుదల చేసినప్పటికీ ఓయూ అధికారులు మాత్రం నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పీహెచ్‌డీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## నేటి నుంచి షిర్డీ సాయిబాబా ఉత్సవాలు

మారేడ్‌పల్లి: మోండా డివిజన్ రెజిమెంటల్‌బజార్‌లోని శ్రీ బాల గణపతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి 19 వరకు మూడు రోజుల పాటు షిర్డీ సాయి బాబా జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు నందికంటి రవి, జ్ఞానేశ్వర్, సతీష్‌లు మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

# నివేదితను మెజార్టీతో గెలిపించాలి

- హాజరైన ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి
- బోయిన్‌పల్లిలో కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం
- భారీ ఎత్తున హాజరైన బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు

కంటోన్మెంట్, ఏప్రిల్ 16: సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదితను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డిలు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం కంటోన్మెంట్ బోయిన్‌పల్లిలోని మల్లారెడ్డి గార్డెన్‌లో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యేలతో పాటు నియోజకవర్గ ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు.వార్డులతో పాటు డివిజన్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కలిసి పనిచేసి యువ మహిళా నాయకురాలు నివేదితకు భారీ మెజార్టీ కట్టబెట్టాలన్నారు. అంతకుముందు దివంగత ఎమ్మెల్యే సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గులాబీ పార్టీతోనే కంటోన్మెంట్ అభివృద్ధి సాధ్యమన్నారు. ఈనెల 19న నివేదిత నామినేషన్ కార్యక్రమం ఉంటుందని.. 20 నుంచి అన్ని వార్డుల్లోనూ పాదయాత్రలు మొదలవుతాయన్నారు. సాయన్న, లాస్యనందిత లాగే.. నివేదితను కూడా భారీ మెజార్టీతో గెలిపించాలని కంటోన్మెంట్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అదే విధంగా బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరారు. కంటోన్మెంట్‌తో పాటు మల్కాజ్ గిరి ఎంపీ స్థానంలోనూ గులాబీజెండాను రెపరెపలాడించాలని కంటోన్మెంట్ ఎన్నికల బీఆర్ఎస్ ఇన్‌చార్జి రావుల శ్రీధర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బోర్డు మాజీ సభ్యులు అనితా ప్రభాకర్, నళిని కిరణ్, పాండు యాదవ్, లోకనాథ్, మాజీ కార్పొరేటర్ ఆకుల రూప హరి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్, సీనియర్ నాయకులు ఆకుల హరి, నర్సింహ యాదవ్, వేణుగోపాల్ రెడ్డి, పలు వార్డుల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు, మహిళా నేతలు, ఉద్యమకారులు, సాయన్న అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

### చేసిన అభివృద్ధిని ఇంటింటికీ తీసుకెళ్లాలి



బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ప్రతి ఇంటికీ పోలింగ్ లోపు కనీసం మూడుసార్లు వెళ్లాలని, కంటోన్మెంట్‌లో జరిగిన అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలతో లబ్ధిపొందిన ప్రతి గడప తొక్కాలని బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు సమయం ఆసన్నమైందని, ప్రతి ఒక్కరూ ఇతరత్రా పనులు పక్కన పెట్టి ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలని సూచించారు. ప్రతి వార్డులో ముఖ్య నేతలు ప్రాతినిధ్యం వహిస్తున్న వారు పార్టీ వార్డు, డివిజన్ అధ్యక్షుడు, కార్యకర్తలను కలుపుకోవాలన్నారు.

జక్కుల మహేశ్వర్‌రెడ్డి, మాజీ ఉపాధ్యక్షులు, కంటోన్మెంట్ బోర్డు



దివంగత ఎమ్మెల్యే సాయన్న, లాస్యనందితల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, రావుల శ్రీధర్‌రెడ్డి , బీఆర్ఎస్ పార్టీ నాయకులు

### మీ ఇంటి బిడ్డను ఆశీర్వదించండి



మీ ఇంటి బిడ్డను, సాయన్న కూతురిని, లాస్యనందిత అక్కను, కేసీఆర్ అభ్యర్థిగా మీ ముందుకొస్తున్నా... తనను మీరందరూ ఆశీర్వదించాలని కంటోన్మెంట్ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత అభ్యర్థించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మనపై పెద్ద బాధ్యత పెట్టారు. అందుకే మీరందరూ నన్ను గెలిపిస్తే కడుపులో పెట్టి చూసుకుంటామని అన్నారు. మీరు ఆశీర్వదిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని, ఈ అవకాశాన్ని మనందరం తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని శ్రేణులకు సూచించారు.

– జి. నివేదిత, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, సికింద్రాబాద్ కంటోన్మెంట్

### బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి



మల్కాజిగిరి పార్లమెంటు స్థానంతో పాటు కంటోన్మెంట్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడి అన్నారు. బోయిన్‌పల్లి మల్లారెడ్డి గార్డెన్‌లో కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్ నగరం ప్రపంచ పటంలో నిలిపిన ఘనత, ఐటీ అభివృద్ధికి కారణం కేసీఆరేనని అన్నారు. కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధి కళ్లముందే ఉందన్నారు. మల్కాజిగిరి పార్లమెంటు సభ్యుడుగా గెల్చిన రేవంత్‌రెడ్డి పార్లమెంటులోని ఏ ఒక్క నియోజకవర్గంలోనూ తిరగలేదన్నారు.

– రాగిడి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి, మల్కాజిగిరి



అభ్యర్థి నివేదితకు సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



సమావేశానికి పెద్ద సంఖ్యలో హాజరైన బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు

## ఎన్నికల ప్రచార వాహనాలు ప్రారంభం







టకారాబస్తీలోని తన నివాసం వద్ద ఎన్నికల ప్రచార వాహనాలను ప్రారంభిస్తున్న సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్

సికింద్రాబాద్,ఏప్రిల్16 : బీఆర్ఎస్ పార్టీ నేతృత్వంలోని కేసీఆర్ ప్రభుత్వ విజయాలను ప్రజలోకి తీసుకెళ్లాలని ఆపార్టీ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్ పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ మోండామార్కెట్,టకారాబస్తీలోని ఆయన నివాసం వద్ద మంగళవారం ఎన్నికల ప్రచార వాహనాలను ప్రారంభించారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అన్ని మున్సిపల్ డివిజన్ల పరిధిల్లో ఈ వాహనాలు సంచరిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడుతూ ప్రజలకు తెలియజెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాదిగలను ఓట్లు అడిగే హక్కు
# కాంగ్రెస్‌కు లేదు

**ఎమ్మార్పీఎస్ కంటోన్మెంట్ ఇన్‌చార్జి ఇటుక శ్రీకిషన్ మాదిగ**

కంటోన్మెంట్, ఏప్రిల్ 16: తెలంగాణలో మెజార్టీ శాతం ఉన్న మాదిగలను విస్మరించిన కాంగ్రెస్‌కు మాదిగలను ఓట్లు అడిగే హక్కు లేదని ఎమ్మార్పీఎస్ కంటోన్మెంట్ ఇన్‌చార్జి ఇటుక శ్రీకిషన్ మాదిగ అన్నారు. ఓట్ల కోసం మాదిగ వాడల్లోకి వస్తే తరిమి కొడుతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ మాదిగల ఆగ్రహానికి గురైన కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోకతప్పదన్నారు.ఎస్సీ రిజర్వేషన్ స్థానాల్లో మాదిగలకు అవకాశం ఇవ్వకుండా మొండిచేయి చూపడం దారుణమన్నారు. కంటోన్మెంట్ అసెంబ్లీ సీటును మాదిగలకు కేటాయించకుండా విస్మరించిందని, బీజేపీ మాత్రం ఎంపీ స్థానాలతో పాటు కంటోన్మెంట్‌లో మాదిగలకు టికెట్ ఇచ్చిందని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ని ఓడించడానికి మాదిగలంతా ఏకం కావాలన్నారు.

## ఎస్పీ రోడ్డులో నేడు సీతారాముల కల్యాణం

బేగంపేట్, ఏప్రిల్ 16: బేగంపేట్‌లోని ఎస్పీ రోడ్డులో ఉన్న హనుమాన్ దేవాలయంలో నేడు శ్రీ సీతారాముల కల్యాణ ం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్టు దేవాలయం ఈవో శ్రీనివాస్‌శర్మ తెలిపారు. మంగళవారం దేవాలయంలో ఆయన మాట్లాడుతూ... బుధవారం ఉదయం 10: 30 గంటలకు దేవాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు వివరించారు. కల్యాణ మహోత్సవంలో పాల్గొనే భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.అదేవిధంగా ఈ నెల 23న హనుమత్ విజయోత్సవం కూడా వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు.

## విద్యుదాఘాతంపై కార్పొరేటర్ ఆరా



మహ్మద్‌గూడలో విద్యుదాఘాతం జరిగిన కుటుంబాన్ని పరామర్శిస్తున్న కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్,ఏప్రిల్ 16: మహ్మద్‌గూడలో నివసిస్తున్న తబుస్సుమ్ ఇంట్లో సోమవారం రాత్రి విద్యుదాఘాతం జరిగింది. దీంతో ఇంట్లో ఉన్న నిత్యావసర సరుకులు, దుస్తులు కాలి బూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ హేమ మంగళవారం ఆ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు.విద్యుత్ ప్రమాదంపై ఆరా తీశారు.ప్రభుత్వం నుంచి అన్ని విధాలా ఆ కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఅర్ఎస్ నాయకులు లంబు కుమార్ తదితరులు పాలొన్నారు.

## చిలకలగూడలో చలివేంద్రం ప్రారంభం

అడ్డగుట్ట, ఏప్రిల్ 16 : మండు వేసవిలో ప్రజల దాహాన్ని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతాయని చిలకలగూడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అనుదీప్ అన్నారు. మంగళవారం చిలకలగూడలో మ్యాకల చంద్రశేఖర రావు(ఎమ్‌సీఆర్) ప్రజాసేవ వ్యవస్థాపక అధ్యక్షులు, బీజేపీ సీనియర్ నాయకులు చంద్రశేఖర రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీఐ అనుదీప్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని అవసరమున్న ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో హన్మంతరావు, మురళి, సంపత్, నందు, అజయ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.





చిలకలగూడలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీఐ అనుదీప్



**మద్దతు కోసం:** సికింద్రాబాద్ లోని బిషప్ హౌస్‌లో మంగళవారం మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి, కంటోన్మెంట్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీ గణేష్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు తో కలిసి కార్డినల్, బిషప్ పూల ఆంథోనిని కలిసి రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ బోర్డు సభ్యుడు జయప్రకాశ్, నాయకులు రాయ్ డిన్ రోజ్, నాయకులు అల్లాడి గౌరీశంకర్, టి రవి పాల్గొన్నారు. – మారేడ్‌పల్లి

## కంటోన్మెంట్ బీజేపీ అభ్యర్థిగా వంశా తిలక్



కంటోన్మెంట్, ఏప్రిల్ 16: సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో ఎట్టకేలకు బీజేపీ తన అభ్యర్థిని ప్రకటించింది. తమ పార్టీ అభ్యర్థిగా డాక్టర్ టి.ఎన్.వంశా తిలక్ పేరును ఖరారు చేసింది. తమ అభ్యర్థిగా డాక్టర్ వంశా తిలక్‌ను ఖరారు చేస్తూ ఆ పార్టీ నాయకత్వం మంగళవారం ప్రకటన విడుదల చేసింది.



**సమస్యల పరిష్కారానికి కృషి**

కంటోన్మెంట్ ఐదో వార్డులోని విక్రంపురి కాలనీలో మంగళవారం ప్రముఖ సామాజిక కార్యకర్త తెలుకుంట సతీష్ గుప్త పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, మంచినీరు సమస్యలను కాలనీ వాసులు సతీష్ గుప్త దృష్టికి తీసుకొచ్చారు. కాలనీల్లో నెలకొన్న సమస్యలను త్వరలో కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా కాలనీ వాసులకు హామీ ఇచ్చారు.

– మారేడ్‌పల్లి

## పనిచేసే నాయకులకు గుర్తింపు

ముషీరాబాద్ : పార్టీలో కష్టపడి పని చేస్తున్న నాయకులకు గుర్తింపు ఇస్తామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. కీలకంగా పనిచేసే నాయకులకు పదవుల కేటాయింపు అంశాన్ని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. మంగళవారం ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు టి.సోమసుందర్‌ను తన నివాసంలో కలిసి పార్టీకి రాజీనామా చేసిన అంశంపై చర్చించారు. భవిష్యత్‌లో గుర్తింపునిస్తామని హామీ ఇచ్చారు. టి.సోమసుందర్ మాట్లాడుతూ.. తన రాజీనామాను విరమించుకుంటున్నట్లు ప్రకటించి బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని తెలిపారు.










ఎంపీ ఎన్నికల సందర్భంగా మంగళవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని వెంగళరావునగర్ డివిజన్‌లో ఉన్న జవహర్‌నగర్‌లో సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్ జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం అందరిని పలకరిస్తూ బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు.

# రక్తదానం..మరొకరికి ప్రాణదానం

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 16: ఉస్మానియా యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. క్యాంపస్‌లోని వివిధ కళాశాలల్లో ఏర్పాటు చేసిన శిబిరాలలో వర్సిటీ పరిధిలోని వివిధ డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ కళాశాలల నుంచి వచ్చిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ శిబిరం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా వీసీ ప్రొఫెసర్ రవీందర్, ప్రత్యేక అతిథులుగా ఎన్ఎస్ఎస్ రీజనల్ డైరెక్టర్ రామకృష్ణ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అర్జున్‌రావు, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శశిధర్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వీరయ్య, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రక్తదానాన్ని మించిన దానం లేదన్నారు. అనంతరం ఓయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ సవిన్ సౌడ మాట్లాడుతూ ఓయూ పరిధిలోని ఎన్ఎస్ఎస్ యూనిట్ల సహకారంతో 325 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు చెప్పారు. కార్యక్రమ విజయవంతానికి కృషి చేసిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.





రక్తదాన శిబిరంలో రక్తదానం చేస్తున్న ఎస్ఎన్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ సవిన్ సౌడ

ప్రత్యేక కార్పొరేషన్
## ఏర్పాటు చేయాలి

కాచిగూడ,ఏప్రిల్ 16 : కురుమలకు ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కాచిగూడ అభినందన్ హోటల్‌లో నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆర్.కృష్ణయ్య విచ్చేశారు. కార్యక్రమంలో కురుమ సంఘం ప్రధాన కార్యదర్శి చెలంపల్లి రమేశ్‌కుమార్, బీసీ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, జి.కృష్ణ, విజయ్, శ్రీనివాస్, మల్లేశ్, అమృత, మహేశ్‌కుమార్, పెంటయ్య, రమేశ్, భిక్షపతి, నందగోపాల్ పాల్గొన్నారు.

# ఈడీ పేరుతో..అక్రమ అరెస్టులు

**కేజ్రీవాల్ అరెస్టును ఖండిస్తూ ఓయూలో నిరసన**

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 16: ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్టును ఖండిస్తూ ఉస్మానియా యూనివర్సిటీలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నేతలు మాట్లాడుతూ.. బీజేపీకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడితే వారిని ఈడీ పేరుతో అక్రమ అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. ఇండియా కూటమిలో ముఖ్య నేత అయిన కేజ్రీవాల్‌ను అరెస్టు చేసి, కూటమిని దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇటువంటి వాటికి భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. విద్యార్థులుగా ప్రధాని నరేంద్రమోడీకి ఒక సూటి ప్రశ్న వేస్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో మోదీ ఇస్తానన్న సంవత్సరానికి రెండు లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. విద్య, వైద్యం ఉచితంగా ఇస్తామని చెప్పి, కనీసం దాని గురించి మాట్లాడడం లేదని మండిపడ్డారు. తాము ఇచ్చిన హామీలు అమలు చేయకుండా, ప్రశ్నించే వారిని అక్రమంగా అరెస్టు చేయడం సరికాదన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని మోదీ ఖూనీ చేసి మోదీస్వామ్యాన్ని సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా త్వరలోనే అన్ని విద్యార్థి సంఘాలతో కలిసి రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు విజయ్ మల్లంగి, అక్షయ్‌రెడ్డి, సోహైల్, వైశాలి, పుట్ట లక్ష్మణ్, మణికంఠరెడ్డి, సత్య, గ్యార నరేశ్, చైతన్య, వికాస్ యాదవ్, సందీప్, రెహ్మాద్ తదితరులు పాల్గొన్నారు.



కేజ్రీవాల్ అరెస్టును ఖండిస్తూ ఓయూలో నిరసన చేస్తున్న విద్యార్థులు